# తుపాకులు

భువనగిరి వెళ్ళే బస్సు నార్కట్‌పల్లిలో స్టార్ట్ అయి రోడ్డెక్కింది. కండక్టర్ వెనుక సీట్ల దగ్గరికి వెళ్ళి టికెట్స్ యిస్తు వస్తు ముందు సీటు దగ్గర ఆగి -

''అమ్మా ఎక్కడికి పోవాలె, టికెట్'' అన్నాడు ఏదో ఆలోచిస్తూ కూర్చున్న ఓ నడివయస్సు స్త్రీని వుద్దేశిస్తు.

''ఏట్లోకి'' అంటు కండక్టర్‌ను ఎగాదిగా చూసింది. ఆమె ముఖం

గుంజాక పోయి వుంది. కాని చురుకైన చూపులు, పుల్లవిరుపు మాటలు.

''అయితే ఇంకో బస్సు ఎక్కు'' అన్నాడు తనలో తాను నవ్వుకుంటు. పొద్దున్నే ఎవరి ముఖంరా నాయన చూసింది. రోజు ఏదో ఓ వాదన, మరేదో గొడవ. ఈ కండక్టర్ నౌకరంత పరేషాన్ నౌకరి మరోటి వుండదనుకుంట, ఎంత మంచిగ ఎంత నిదానంగా వుందామన్నా ఏదో ఓ రాద్ధాంతం.

''టికెట్ తీసుకో'' ఈసారి మాటలో కాఠిన్యం ధ్వనించింది. చూపులో తీవ్రత కదలాడింది. తీసుకోకుంటే ఏం జేస్తవు అన్నట్లు చూసింది. కోపం, వ్యతిరేకత ఎండవాన కల్సి వొచ్చినట్టు వొచ్చాయి ఆమె ముఖంలో.

''టికెట్ తీసుకుంటవా దింపెయ్యమంటావా?'' అన్నాడు చేసేది లేక తను తీసుకోబోయే ఆఖరు చర్యను ప్రకటిస్తు.

''ఏది దింపేయి సూస్త'' గుడ్లురిమి, ముక్కు పుటలను కదిలిస్తు అంది. అప్పుడు బస్సులోని సగానికి పైగ ఆమె వైపు అదోమాదిరిగ చూస్తు విషయం ఏమిటా అని ఆసక్తిగ వింటు వున్నారు.

కండక్టర్ బెల్ కొట్టాడు బస్సు పక్కకు ఆగింది.

''దిగమ్మ'' అంటు కండక్టర్ ఎడమ చేత్తో బస్సు డోర్ తెరిచి, కుడిచేతిలో వున్న టికెట్ పంచ్ ప్లెయర్‌తో దిగమని సైగ చేశాడు.

''నేను దిగను'' అంటు ముందు సీటు వైపును గట్టిగ పట్టుకొని, తన మొండితనాన్ని ప్రదర్శించింది.

అందరు ఆమె వైపు చూస్తు ఎందుకట్ల అని ఆలోచిస్తువున్నారు. ఆమె తీక్షణంగా బస్సు కిటికిలో నుండి బయటికి చూస్తూవుంది. ఎన్ని రోజుల కింది తలంటుకుందో నెత్తంతా దుమ్ము పట్టివుంది.

కాని ఏదో పరేశానిలో పడి సరిగ తినకనేమో ముఖం గుంజాక పోయినట్టుంది. ఆమె నుదురు భాగంలో ఏదో బాధ గూడుకట్టుకున్న గుర్తులు.

''చూడమ్మా నీవు టికెట్ అన్నా తీసుకో లేదా దిగనన్న దిగు'' ఈ సారి కండక్టర్ ఓపిగ్గానే అన్నాడు. ఈమెతో గట్టిగ మాట్లాడితే బెడుస్తుందని.

''దిగనంటె దిగను'' అన్నది ఆమె.

''బస్సు యిక్కడ ఆపేస్త'' అన్నాడు.

''అమ్మా టికెట్ తీసుకో'' అన్నారెవరో వెనుకనుండి బస్సు ఆగితే మళ్ళీ ఎపుడు స్టార్ట్ అవుద్దోనన్న అనుమానంతో.

''సర్కారు బస్సు టికెట్ తీసుకోకపోతే ఎట్లా'' అన్నాడు మరొక ప్రయాణికుడు.

''సర్కారు బస్సు కనుకనే టికెట్ తీసుకోను'' అంది తాపిగ కిటికీలోనుండి బయటకు చూస్తు.

''చెకింగ్ అయితే కండక్టర్ నౌకరు పోద్ది'' మరో ప్రయాణికుడు.

''పోని'' అంది.

''పిచ్చా, చాదస్తామా'' అన్నాడో ప్రయాణికుడు

''ఏంది పిచ్చా? నీకు పిచ్చి, నీ అమ్మకు పిచ్చి, నీఅయ్యకు పిచ్చి, మీ అందర్కి పిచ్చి, పిచ్చి'' అని ఎగపోస్తు అంది. ముందు పిచ్చా అన్న వ్యక్తి వైపు చూస్తు నిజంగా పిచ్చి పట్టినట్టే అరిచింది. అది విన్న ఆ వ్యక్తి చేసేది లేక నోరు మూసుకున్నాడు.

ఆమె వెనుక సీటులో కూర్చున్న సత్యం ''ఆమె వాదనను బట్టి ఏదో బాధలో వున్నట్టుంది'' పక్కన్నే కూర్చున్న మూర్తితో అన్నాడు.

వాళ్ల యిద్దరి వయసు దాదాపు వొకటె. వాళ్లిద్దరిలో సత్యం టీచర్, మూర్తి రెవిన్యూలో క్లర్క్. కళారూపాలను అభిమానిస్తు, సాహిత్యాన్ని ఉపాసిస్తు. అలాంటి అంశలు ఎవరిలోనైన కనిపిస్తే ప్రోత్సాహిస్తు వుంటారు. అందువల్ల ఎదుటివ్యక్తి మాటల్లోని ద్వనిని బట్టి, చూపులను బట్టి అసలు విషయాన్ని యిట్టే గ్రహిస్తారు సత్యం, మూర్తి గూడ.

''ఆమెకు వలిగొండ టికెట్ యివ్వండి'' అంటు డబ్బులిచ్చాడు సత్యం. కండక్టర్ టికెట్ పంచ్‌చేసి ఆయనకే యిచ్చి బెల్ కొట్టాడు. బస్సు కదిలింది. అందులో కూర్చున్న జనం అంతా ఒక్కసారి గాలి పీల్చుకున్నారు.

కండక్టర్ వైపు గుడ్లురిమి చూస్తూ ''ఇపుడు నీవు బస్సును అట్లనే ఆపితె, ఇక్కన్నే బస్సుకు అగ్గిపెడుదును'' అంది.

'' తగల బెట్టన్ మరీ నీ తాత సొమ్మాయే'' అన్నాడు కండక్టర్ యస్సార్ నింపుతూ కాస్త గట్టిగానే.

''యిప్పటి వరకు తగుల బెట్టిన బస్సులన్ని వాళ్ల తాత సొమ్మనే తగుల బెట్టింండ్రా'' గొంతు తీవ్రతను పెంచుతు అంది.

''ఇగ చెప్పు '' అన్నారెవరో వెనక.

''అమెను రెచ్చగొట్టకండి '' అన్నాడు సత్యం చుట్టు చూస్తు

''బస్సు కాలినా మీ జీతాలైతే పిట్టలు మెయ్యవుగ, కాలె బస్సుల కాలుతువున్నా మీ జీతాలు పెరుగుతూనే వుండె అంది.

'' ఆ నీయింట్ల కెల్లి యిస్తుంటివి'' అన్నాడు కండక్టర్ రాసుకుంటునే.

అది విని ఆమె పెద్దగా నవ్వింది.

అందరు ఆమె వైపే చూస్తువున్నారు.

''అయ్యల్లార యిప్పుడు బస్సులో కూర్చున్న వాల్లందరు యిచ్చిన

పైసలు వాళ్ల వాళ్లయి కావా'' అంది.

''నీవైతె యివ్వలేదు గద'' అన్నాడు కండక్టర్ కాస్త వ్యంగ్యంగా ఆమె వైపు చూస్తు.

''కండక్టర్ సాబ్ ఎవర్సైతె ఏమి అమె టికెట్‌పైసలు వొచ్చినయి గద అన్నాడు మూర్తి.

''ఏం సారు మీరు ఆమెని సపోర్టు చేస్తరు. ఆమె ఎట్లా మాట్లాడుతుంది''.

అంటు వెనక్కు మళ్లి చూసాడు. మంటలో పొగ కలిసొచ్చినట్టు ఆయన చూపుల్లో ఈసడింపు - కోసం.

''కాస్త నిదానం'' ఆమె మాటలకు పట్టిచ్చుకోకు అన్నట్టు సైగ చేశాడు సత్యం టీచర్.

ఏమోనండి అన్నట్టు పెదాలను బిగపట్టి వదులుతు తదనుగునంగా, కళ్లను కదలిస్తు చూసి, చూపులను క్యాష్‌బ్యాగ్ వైపు తిప్పుకుని టికెట్ పంచ్‌చేసే ప్లైమర్‌ను క్యాష్‌బ్యాగులో వేసుకున్నాడు.

ఆమె మాత్రం తనలో తానె గులుగుతూనే వుంది. ఆమె ఎదలో ఏబాధకదులుతుందో.

''చూడడానికి మంచి ఆరోగ్యంగానే కనిపిస్తువుంది. ఎందుకు అట్ల మాట్లాడుతుందో'' అన్నాడు సత్యం వాళ్ల వెనక సీట్లో కూర్చున్న ఓపెద్దమనిషి. అది విన్నమూర్తి వెనక్కు మళ్లి-

''మనిషిఆరోగ్యంగా వున్నా మనస్సు వుండొద్దా'' అన్నాడు మూర్తి. అయన మనుషుల గూర్చి తెలుసుకోవడానికే పుస్తకాలు చదువుతాడు. చదివి మనుషుల గూర్చి ఆలోచిస్తాడు.

''అంతె అంటారా'' అన్నాడు ఆపెద్ద మనిషి.

''ఆమె ఏదో భాధలో వుంది. లేకపోతే అట్లా మాట్లాడదు'' అన్నాడు సత్యం.

ఈ లోపు బస్సు చిట్యాలలో ఆగింది. అక్కడ ఓ ఖద్దరు బట్టల రాజకీయ నాయకుడు బస్సెక్కాడు. బస్సు ఫుల్ అయి ఒక్క సీటు కూడా ఖాళీ లేదు.

కండక్టర్ లేచి తన సీటిచ్చాడాయనకు . అది చూసి ఆమె మళ్లీ మొదలు పెట్టింది, దొంగను చూసినట్టు చూస్తు -

''ఈ దేశంలో బతకాలంటే ఏషం మంచిదేసుకోవాలె'' అంది.

ఖద్దరు వాలా ఆమె వైపు చూసి, జేబులో నుండి డబ్బు తీసి కండక్టర్‌కిస్తూ

''రామన్న పేట'' అన్నాడు. కండక్టర్ టికెట్ మిగతా చిల్లర తిరిగిచ్చాడు.

''పోరాటమపుడు ఆయుదాలు పట్టుకున్నోల్ల మంట్ల గలిసింగ్రు. స్వరాజ్యంవొచ్చినంక మాయ మాటలు జెప్పి పదవులను పంచుకొని ప్రజానాయకులం అని బతుకుతుంగ్రు'' అంది కిటికీలో నుండి బయటికి చూస్తు ఆ మాటల్లో వెటకారం, నిష్టూరం కదిలాడింది.

''ఏమిటి సంగతి'' అన్నట్టు చూశాడు ఖద్దర్ వాలా కండక్టర్ వైపు.

ఏమో సార్ అన్నట్టు పెదవిని విరిచి భుజాలను కదిలించాడు. అప్పుడు చెవిలో వున్నపెన్సిల్ కింద పడగ దాన్ని అందుకోవడానికి వంగి, ''బస్సెక్కినప్పటినుండి వొకటే గోల'' అన్నాడు మెల్లగా.

అట్లనా అన్నట్టు చూశాడు ఖద్దరువాలా.

''ఈమెను ఎక్కడో చూసినట్టుంది'' అన్నాడు ఖద్దర్‌వాలా.

''ఎక్కడ చూసింగ్రో ఏమో మెదడు తినేస్తుంది'' అన్నాడు కండక్టర్

అమెకు వినపడకుండా. ఉన్నట్టుండి అమె మౌనంగా ఏడుస్తూవుంది. బస్సంతా నిట్టూరుస్తూ ఆమె వైపు చూస్తు వున్నారు. కండక్టర్ మాత్రం అమె వైపు చూడకుండ బస్సులోని జనాన్ని లెక్క పెట్టి, ఇచ్చిన టికెట్లను లెక్క చూసుకుంటు ''అందరు టికెట్స్ తీసుకున్నట్టె కద'', అని జనాన్ని మళ్లి లెక్కపెట్టి ఎవరో టికెట్ తీసుకోలేదు'' అంటు చికాకుగ చూసి, ఓ పిల్ల తల్లిని ఉద్దేశించి ''అమ్మా అ పిల్లకి టికెట్ తీసుకున్నావా ?'' అంటు వెనుక సీటు వైపు నడుస్తు అడిగాడు.

''గీమెకు టికెటెందుకు మూడేండ్లు కూడ లేవు'' అంది తన బిడ్డను పొదివి పట్టుకుంటు.

''ఆరేండ్ల పిల్లను పట్టుకుని మూడేండ్లంటవు ఎట్టనమ్మ, తే, తియి తియి పైసలు తియ్యి'' అంటు అమె దగ్గరే నిలుచున్నాడు.

అ సంభాషణ విన్నపాప, ''అవును నాకు ఆరేండ్లు ఒకటో తరగతి చదువుతున్న'' అంది కండక్టర్‌వైపు నిక్కి చూస్తు.

''మంచి పాపవు. తీయమ్మ పైసలు తీయి'' అంటు ఆఫ్ టికెట్ ఇష్యూ చేసాడు. తల్లి పైసలు యివ్వక తప్పలేదు. ''దీన్ని చదవిస్తే వున్న మతి పోతుంది'' అంది బిడ్డ వైపు కోపంగ చూస్తు.

ఖద్దర్‌వాలా దుఃఖిస్తున్నామెవైపు పరిశీలగా చూస్తువున్నాడు. ఆమె చేతులకు గోట్లున్నాయి. నుదుట బొట్టు లేదు. అమె పోరాటపు రోజులు గుర్తు చేసినందుకు ఒక్కసారె అతని మనస్సు పాతకేండ్ల వెనక్కు పరుగెత్తింది.

••••

నిజాం గద్దె దిగాలని ప్రతి వ్యక్తి అయుధం అందుకొని పోరాడుతున్న రోజులు. పోరాట యోధులు గెరిల్లా దళాలుగా ఏర్పడి

రజాకార్ల మీద మెరుపు దాడి చేస్తూవున్నారు. వలిగొండ నుండి మోత్కూర్‌వైపు వెళ్లె ఏరియా దళ నాయకుడు వలిగొండ బ్రిడ్జిని ఓకంట కనిపెడుతు వున్నాడు. రజాకార్లు గెరిల్లాల గాలింపు చర్యను ముమ్మరం చేశారు. దళ నాయకుల చిరునామాలు తెలుసుకొని, వాళ్ల కుటుంబ సభ్యులను నానా హింసకు గురిచేస్తు, ఎవరెవరు ఎక్కడున్నది చెప్పమని బాధించేవారు. అ రోజులు తలుచుకుంటె గుండె చెరువవుతుంది. మౌనంగా ఏడుస్తున్న ఆమెకు సరిగ్గా అపుడె చూపులకు అడ్డంగా కన్నీటి తెరలు. ఓ రోజా పొయ్యి మీద ఎసరుపెట్టి తన ఆరునెలల కొడుకుకు పాలిస్తు, ఎన్నో నెలల నుండి యింటికి రాని భర్తను తలుచుకుంటు చాటలో బియ్యంలోని రాల్లు ఏరుతువుంది ఓ స్త్రి. మధ్య మధ్య పాప పాలు తాగడం ఆపి, కాళ్లు చేతులు అడిస్తు బోసినవ్వులతో తల్లి వైపు చూస్తున్నాడు. పాల ధార అగిపోయి కన్నీటి చుక్కలు చాటలో రాలగానే ఉలిక్కిపడి, బాబు ముఖంలోకి సూసింది. ఒక్కసారె దుఖం మాయ మైంది. అచ్చం తన భర్త నాగన్న ముఖమే. ఎపుడన్న తీరిగ్గా పరాచికాలాడినపుడు ఆయన నవ్వు ఇట్లనే వుండేది. మరొకసారి కొడుకును తనివి తీరా ముద్దాడింది. అప్పటి వరకు తన మనస్సులో వున్న తన భర్త ఎడబాటు జ్ఞాపకాలు అ ముద్దుతో కాసేపు కనుమరుగు అయినయి.

అంతలోనే ఎవరో వస్తున్న చప్పుడైంది. అది విని బిడ్డను గుండెల కదుముకుంది లేచి నిలుచుంది.

''నిమ్మకాయలు'' అన్నాడు ఓవ్యక్తి దర్వాజా దగ్గర నిలుచోని. ఆయన ఓ భుజాన నిమ్మకాయలున్న గోనెసంచి, మరో భుజాన వేలాడుతున్న కండువలో ఒకవైపు సజ్జలు వున్నాయి. తన భర్త వెళ్లేటప్పుడు

చెప్పిన గుర్తులకు ఈ వచ్చిన మనిషి పోలికలు కలిశాయి. అంతెకాదు ''నిమ్మకాయలు'' అనే రహస్యపు సంకేతపదం గుర్తు గుర్తొచ్చింది.

''అక్కా నిమ్మకాయలు కావాల్న'' అన్నాడు.

ఏదో ఉత్సాహం వంటి నిండా నిండుకోగ లోపలకి రమ్మని సైగ చేసింది.

''నీవే రా అక్క దరువాజ దాటలేను'' అన్నాడు. బాబును రొండిన ఏసుకోని తానె వచ్చింది. తన భుజాని కున్న మూటను దించుకుని చుట్టు ఓసారి చూసి, వంగుతు ''ఏరుకో అక్క నీ యిష్టమెచ్చినవి ఏరుకో'' అని ''నాగన్న రేప్పొద్దున వేములకొండ జాతరకు వస్తుండు. జాతరల కుంకుమను కుప్పలు పోసుకొని అమ్ముకుంట కూర్చుంటడు. నీవు బాబును ఎత్తుకుని వచ్చి కూర్చోని ఏంమాట్లాడకు, కుంకుమను కొనుక్కుని పైసలచ్చిరా. అప్పుడు మాత్రం నాగన్నకు బాబు కనపడేట్టు ఎత్తుకో'' అంటు అక్కడికి ఎవరో వచ్చేది చూసి ''ఎన్నని ఏరువతమ్మ కానియ్యి, కానియ్యి యింకా ఊరంతా తిరగాలి ''అన్నాడు ఆవచ్చినవాడు తనదారిన తాను పోయాడు.

''అక్క అకలైతుంది అన్నవుందా'' అన్నాడు. ఆమె అతని అంటుకపోయిన డొక్కవైపు చూసింది. అప్పుడు ఆమెగుండె తరుక్కపోయింది.

''ఇంక వండలేదు. ఎసరు కాగుతుంది కాసేపు ఆగితె- అంది భాధగ బయట తిరిగే ఈయనె యిట్లా వుంటె తన భర్త అని తలుసుకోగానే కన్నీళ్ళు తన్నుకొచ్చాయి. కుక్కలు మొరిగిన చప్పుడు. ఎవరో వస్తున్నట్టు మూటలు సర్దుకుని లేస్తు-

''అన్నం ఉడికిందాక వుండలేను'' అని మూటలను భుజాన వేసుకుని

నిమ్మకాయలు'' అంటులేచి అక్కడినుండి కదలినాడు. అతను సందు మల్లే వరకు చూసి, బాబును ముద్దాడుతు, నిమ్మకాయలను వడిలోవేసి, రొండికి చెక్కుకుని బాబును రెండు చేతుల్లో ఎత్తుకుని ఉయ్యాల ఊపినట్టు ఊపుతు మురిసింది. ఎసరు కాగిపొంగి పొయ్యి చల్లారుతున్న చప్పుడు.

ఇక రాత్రంత కంటికి నిద్రే లేదు. మంచం మీద ముదుసలి మామ గర్రుపెడుతు పడుకున్నాడు. పందిట్లో కుక్క పడుకొని మధ్య మధ్య గునుసుతు వుంది. రెండు మూడు సార్లు తలుపు చప్పుడైనట్టు అనిపిస్తే లేచి కూర్చోని కాసేపు చెవులటుంచి ఎవరు రాలేదని నిట్టూర్చి బాబుని పొట్టలోకి చేర్చుకుంటు ''ఓరె నా తండ్రి రేపు మీనాన్న నిన్ను సూస్తారు. సూసి ముద్దులతో ముంచెత్తుతాడుర. అచ్చం నాలాగే వుండని మురిసి పోతాడుర కన్న '' అంటు పసి వాని ముఖంలోకి చూసింది. నిద్రలో అనవ్వు ముఖాన్ని చూసి ఓ సారి నిద్రాభంగం కాకుండా ముద్దు పెట్టుకుంది.

తెల్లారి వేములకోండ జాతరలో కుంకుమ కుప్పలను వెతుకుతు వుంది. ఆమె భుజాన పసివాడు. వాని తలకు కుచ్చుల కుల్ల. చేతులకు తెల్లనిరాల్లు పొదిగిన నల్లని పూసలు కుచ్చి కట్టింది. నుదుట, బుగ్గమీద నల్లని కాటుక బొట్టు పెట్టింది. కాళ్లకు రాగి వెండి కలిపి చేసిన కడియాలు తొడిగింది. మెడలో వెండికత్తి. బిల్లను వేసింది. మొలకు నల్లని దారం కట్టింది.

జాతరంతా తిరిగి చూసింది. అక్కడక్కడ కుంకుమ కుప్పలున్నా ఆయనలేడు. కళ్ళ దివిటీలై వెతుకుతున్నాయి. మనస్సు వేయికళ్లే చేసుకొని వెతుకుతు వుంది. ఆయన మాత్రం కనబడలేదు. కాసేపైనాక

వస్తుండొచ్చు). ఈ లోపల గాజులన్న వేయించుకుందాం అని గాజుల దుకాణం ముందు కూర్చుంది. గాజులను చూస్తు ఆయనకు ఏరంగు గాజులైతే యిష్టమొ ఎన్నడు చెప్పలేదు. ఏనాడైన తీరిగ్గా యింటిపట్టు వుంటేకదా అనుకొని ''ఆ ఎర్ర గాజులు తొడుగు'' అని గాజు మలారం ముందు కూర్చుంది. భుజం మీద కొడుకు వాని నోట్లో బొటిమన వేలు. ఆదుకాణం వాడు గాజులను చూపిస్తు ధర చెప్పాడు. ఆమె సరే అంది. ''పాత గాజులు తీసియ్యమంటావా అన్నాడు ''అమ్మో వద్దు వాటిని అట్టనే వుంచి కొత్తయి తొడుగు'' అంటు గాజులు ఎక్కియ్యడానికి చేయి యిచ్చింది. అతను సరె అని గాజులను జత జతగ గలపి ఎక్కిస్తువుంటె అవి చిట్లిపోతువున్నాయి. అతనూ ముఖం చిట్లించుకుంటూ వున్నాడు.

చంకలోని బాబు ముందుకు మళ్లి రంగురంగుల గాజుల వైపు చూస్తు హు కొడుతు వున్నాడు. అప్పుడప్పుడు వంగి గాజులను అందుకోవాలని ప్రయత్నం చేస్తువున్నాడు. ''అమ్మా అట్ట బిగపట్టినట్టు రెక్క పెడితె గాజులెక్కపు'' అన్నాడు తన పళ్లు బిగుస్తు చికాకుగ గాజులవాడు.

ఆమె కదిలి కూర్చుంటు ఓసారి కుంకుమ కుప్పల వైపు చూసింది. ఆయన రాలేదు. కాని ఆయన గురించి పక్క దుకాణంలో అనుకుంటున్న మాటలు చెవిలో పడగానె భూమిగిర్రున తిరిగినట్టు అనిపించింది. కళ్లు మూతలు పడ్డాయి. వేములకొండ మీది దేవుడు గుట్ట మీదినుండి కిందజారి పడ్డట్టు అనిపించింది. గుట్టమీది గుండం అంత ఎర్రగై మనిషి రక్తంలా మారినట్టు అనిపించింది. సంకలోని బాబుజారి ఏడుస్తువున్నాడు ఆ ఏడుపువిని ఈ లోకంలోకి వస్తు బాబును ఎదమీదికి ఎగేసుకుంటు లేస్తు, ''నాకు గాజులొద్దు అన్న'' అంది అప్పుడామె గొంతు పూడకపోయినట్టు పలికింది. కళ్ల నిండా నీళ్లు, గుండె నిండా దుఃఖం.

ఆమె అక్కడినుండి కదిలి వచ్చిన దారివైపు నడుస్తు వుంటె జనం ఆరోజుతెల్లవారుజావున వలిగొండ దగ్గర రజాకార్ల కుంకువు సంచులతో వస్తున్న 'నాగన్న'ను తుపాకితో కాల్చి చంపింద్రు'' అని అనుకుంటున్నది విని శోకమూర్తిగా మారింది.

••••

రామన్నపేటలో బస్సు ఆగింది. ఖద్దరువాలా దిగిపోయాడు.

ఇద్దరు పోలీసులు బస్సెక్కారు. చేతుల్లో తుపాకులు. కండక్టర్ టికెట్ అడగలేదు వాళ్ళేదో కాగితాన్ని చూపించారు. అది చూసి మళ్లీ ఆమె మాట్లాడసాగింది. ఈ సారి ఆమె ముఖ కదలికలు మారిపోయినాయి. దుఃఖం పోయి రోషం చోటుచేసుకుంది. తుపాకుల వైపు వాటిని పట్టుకుని కూర్చున్న పోలీసులవైపు తీక్షణంగా చూస్తువుంది. అపుడామె కళ్ళు ఎరుపు ఎక్కుతూ వున్నాయి. గుండెలో నుండి గతం తన్నుకొస్తువుంది.

''ముందు ఉద్యోగుల జీతాలు పెరగాలని సమ్మె సేసింద్రా?

పెరగలేదు.

ఈ ప్రభుత్వాన్ని పడగొడదాం అన్నారా?

ఉద్యోగులంతా ఏకమై ఊరేగింపు తీసి, సభలు చేసి, ధర్నాలు సేసింద్రా?

ప్రభుత్వం పడిపోయిందా? కాకపోతె నడిపేవాళ్ళు మారింద్రు.

విద్యార్థులను రెచ్చగొట్టింద్రా? స్కూల్స్, కాలేజీలను మూయించింద్రా? ప్రభుత్వ ఆస్తులకు నిప్పు బెట్టింద్రా? బస్సులను తగులబెట్టింద్రా? టెలిఫోన్ తీగెలను తెంపించింద్రా? చివరికి మాతెలంగాణాకు అన్యాయం జరుగుతుంది. ఏరే రాష్ట్రం కావాలన్నరా?

అవును ఆ మాటలతో నాయకులు మర్రి వృక్షమంత ఎదిగారు. విద్యార్థి లోకం జూలు విదిలించి మళ్ళీ గర్జించారు. ఊళ్ళకు ఊళ్ళు కదిలొచ్చాయి. పట్టణాలన్ని ఉరుకులు పరుగులు. విద్యుత్ శక్తికి అంతరాయం, హైద్రాబాద్ నగరం అంతా చిమ్మ చీకటైపోయింది. రాత్రికి రాత్రి భారత ప్రధాని నగరానికొచ్చి పరిస్థితులు సమీక్షించి వెళ్లినా, పరిస్థితులు యధాతథం, అల్లకల్లోలం.

రైళ్లను ఆపేశారు. రాష్ట్రాన్నంతా అతలాకుతలం చేశారు. జైళ్లన్ని ప్రత్యేక తెలంగాణ పోరాట కార్యకర్తలతో నిండి పోయాయి.

రాజకీయనాయకులు విద్యార్థి నాయకులు కలసి పోరాటాన్ని మరి ఉధృతం చేశారు.

ఊరేగింపులు హద్దులు దాటాయి. నినాదాలు ఆకాశాన్ని అంటాయి. అంతా అల్లకల్లోలం. ఎన్నో కుటుంబాలను కంటికి నిద్రలేదు. నిన్నటివరకు కలసి తిరిగినవాళ్ళు యిక తప్పుక తిరుగసాగారు. మాట్లాడకూడనంత మౌనం మనిషి మనిషి మధ్య పెరిగిపోయి అలజడి హద్దులు దాటింది. లూటీలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం స్తంభించి పోయింది. అయినా తెలంగాణా నాయకుని చేతికర్ర కదిలి కదలి జనాన్ని కదిలిస్తూనేవుంది.

ప్రభుత్వం ప్రజల మధ్య పోరు పెచ్చురిల్లిపోయింది! అది చూసిన ప్రభుత్వం తుపాకులను ఎక్కు పెట్టింది! ఎన్ని చోట్ల లాఠీ చార్జీలు! టియర్ గ్యాసులు, మరెన్నో చోట్ల ఫైరింగులు-

ఎందరు నేలకొరిగారు-

సరిగ్గా అప్పుడే ''అమ్మా'' అని అరిచినపుడు పేగు గదిలింది. గుర్తొచ్చిందేమో ఆమె పెదవులు అదిరినయి. అప్పటివరకు మౌనంగ

ఆలోచిస్తున్న ఆమె ఒక్కసారె గట్టిగ అరిచి ఏడవసాగింది. పక్కనున్న ఆడవాళ్ళు ఆమె భుజాలమీద చేతులేసి ఓదార్చి కూర్చోబెట్టారు. అయినా ఆమె తలెత్తి - ''అగో అదే పోలీసు! అయే తుపాకులు నాఒక్కగానొక్క కొడుకును నిలువున కాల్చేసిరి. నావొక్క కొడుకే కాదు ఎందరి కొడుకులనో పొట్టన పెట్టుకుంండ్రు. వూశోకం వూకేపోదు. తప్పక తగులతది''.

బస్సంత కలియజూసి ''మరి తెలంగాణ వచ్చిందా? మనిషిమనిషి మధ్య పరాయితనం పెరిగింది కదా. యింత జరిగినా అంతా మరిచిపోయి మల్ల వాళ్ళకే ఓటేసి గెలిపిస్తుండ్రా? ఇప్పుడు వాళ్ళు మంత్రులు! ముఖ్యమంత్రులు!''

బస్సు వలిగొండ బ్రిడ్జిమీదనుండి పోతువుంది. బ్రిడ్జ్ దాటగానే వేములకొండకు వెళ్ళే రోడ్డు కనపడింది. ''బస్సాపు'' అని అరిచింది సీటునుండి లేస్తు ఆమె.

ఇంత విని గూడ కండక్టర్ బెల్ కొట్టలేదు.

డ్రైవర్ గేర్ మార్చి బస్సు ఆపి, ఆ తరువాత వెనక్కు మళ్ళి, ఆ దిగుతున్న ఆమె వైపు చూశాడు.

ఆమె దిగుతూ దిగుతు పోలీసుల వైపు, తుపాకుల వైపు చూస్తు తనలొ తానె ఏదో గునుగుతునే దిగింది. మూర్తి లేచి వెళ్ళి ఆమె దిగేవరకు మెట్ల వరకు వెళ్ళి నిలుచున్నాడు.

''ఏంది సార్, మీరట్లనే'' కండక్టర్

కండక్టర్ వైపు చూస్తు

''ఆమె పిచ్చిదానిలాగ కనిపిస్తుంది కదా నీకు'' అన్నాడు మూర్తి కండక్టర్ పక్కన ఆగి.

''అయ్యొ ఆమె గూర్చి నాకెరుకే. ఆమె ఎన్నోసార్లు ఇక్కడ దిగడం చూశాను. బ్రిడ్జ్ దగ్గరికి రాగానే శోకమూర్తిగ మారిపోతుంది'' అన్నాడు డ్రైవర్.

''ఆమెకు మిగిలింది అదే కదా'' అన్నాడు మూర్తి డ్రైవర్ వైపు చూస్తు.

''గతం తెలుసుకోక గుర్రుమండుండు పిల్లడు'' అన్నాడు సత్యం తన సహజదొరణిలో. బస్సు కదిలి పరుగందుకుంది.

మూర్తి కండక్టర్‌నుద్దేశిస్తూ-

''క్లాసు పుస్తకాలు చదివితివి, పాసై ఉద్యోగం కొట్టేస్తివి. ఇంకా వేరే పుస్తకాలు గూడ చదువు, లోకం సంగతి తెలుస్తది'' అన్నాడు మూర్తి.

కండక్టర్ నోట్లను పేర్చుకుంటు విన్నాడే కాని మాట్లాడలేదు.

''గోర్కి రాసిన 'అమ్మా' అని ఓ పుస్తకం వుంది, చదువు. అది చదువితె యిప్పుడు పోయినామె పిచ్చిదో, మంచిదో తెలుస్తుంది.'' అంటు వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

ఆమె పిచ్చి ఈనకొచ్చినట్టుంది అని అనుకున్నాడే కాని బయటకు అనలేకపోయాడు కండక్టర్.

వలిగొండ వచ్చింది. బస్సు ఆగింది.

• 1998